క్లుప్తంగా

మూడు ఆలయాల్లో కానుకల లెక్కింపు



పాత గుంటూరు: కొత్తపేట ఆంజనేయస్వామి, జగన్నాథస్వామి దేవస్థానాలు, లాలాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీల కానుకలు లెక్కించారు. పొన్నూరు ఆంజనేయస్వామి ఆలయం ఈఓ టి.శ్రీనివాస్ పర్యవేక్షణలో చైర్మన్ పి.జయప్రకాష్‌రెడ్డి, సభ్యుల సమక్షంలో సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. జగన్నాథస్వామి ఆలయంలో రూ. 25, 548, ఆంజనేయస్వామి ఆలయంలో రూ.4,07,551, వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ. 5,82,724 ఆదాయం వచ్చిందని, మొత్తం రూ.10,15, 823 ఆదాయం వచ్చింది. ఆలయాల ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



నెహ్రూనగర్: గర్భిణులకు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ గుంటూరు అర్బన్(1) సూపర్‌వైజర్ పి.నీలిమ పేర్కొన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం 10, 11, 56వ డివిజన్లలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు చిరుధాన్యాలతో కూడిన పదార్థాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఐరన్, కాల్షియం పుష్కలంగా లభిస్తుందన్నారు. అంగన్‌వాడీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు గంజి పంపిణీ



పట్నంబజారు: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఉపవాసాల అనంతరం తీసుకునే గంజిని సోమవారం నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల మాయాబజారులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సజీల మాట్లాడుతూ ముస్లింలు కఠిన ఉపవాసాల అనంతరం గంజి తీసుకుంటారని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో అబ్దుల్‌సత్తార్, మొహమ్మద్ అలీ, సయ్యద్ రెహమాన్, హిదాయతుల్లా, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కేంద్ర గణాంక శాఖ నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భాగంగా జీవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్విజ్‌లో పాల్గొని ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మనోహర్‌తో పాటు ఐసీ క్యాంపస్ ఇన్‌చార్జ్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళీధర్, గణాంక శాస్త్ర విభాగాధిపతి అమూల్య అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం వనస్థలిపురంకు చెందిన బేల్దార్ మేస్త్రిగా పనిచేసే చెంగంరెడ్డి కోటిరెడ్డి (35) వనస్థలిపురంలోనే ఒక ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. అనంతరం అక్కడే కార్మికులతో కలిసి మద్యం తాగి నివాసంలోని అటకపై పడుకునేందుకు గోడ ఎక్కుతున్న క్రమంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వచ్చి చికిత్స చేయించిన అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా, తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కృత్రిమ మేధ సక్రమ వినియోగంతో లాభాలు

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభం



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, వేదికపై అగ్ని–5 డైరెక్టర్ డాక్టర్ జి.రామగురు తదితరులు

ఏఎన్‌యూ: మానవ మేధస్సుకు నేటి కాలంలో కృత్రిమ మేధస్సు ప్రత్యామ్నాయంగా మారిందని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ వైఎస్సార్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'కాంపోజిట్ మెటీరియల్ ఫర్ బయోమెడికల్ అప్లికేషన్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును సోమవారం వీసీ ప్రారంభించారు. వీసీ ప్రసంగిస్తూ కృత్రిమ మేధస్సు అందుబాటులోకి రావడం మంచి పరిణామమే కానీ అది మానవ మేధస్సు, మానవుడిపై ఆధిపత్యం చెలాయించడం సరికాదన్నారు. మానవ మేధస్సును సక్రమమైన మార్గంలో నడిపించే సాంకేతికతను అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రస్తుతం మెకానికల్ ఇంజినీరింగ్‌కి డిమాండ్ కొంత తగ్గినప్పటికీ రక్షణ రంగంతో పాటు పలు విభాగాలలో విస్తృతమైన ఉపాధి అకాశాలు ఉన్నాయని, దానికి కావాల్సిన నైపుణ్యాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. యూనివర్సిటీలో విద్యార్థులు చేసే నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని, పేటెంట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. అగ్ని–5 ప్రాజెక్టు డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ డైరెక్టర్ డాక్టర్ జి.రామగురు ప్రసంగిస్తూ ప్రపంచం గర్వించే శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాంతో కలిసి పనిచేయడం ఎంతో గర్వంగా భావిస్తున్నానన్నారు. శాస్త్ర, సాంకేతిక అంశాలలో ఎన్నో నూతన విషయాలకు ఆయన నాందిపలికారని తెలిపారు. ఏఆర్‌సీఐ శాస్త్రవేత్త డాక్టర్ జీవీ శారద ప్రసంగిస్తూ విద్యార్థులు స్టార్టప్‌లపై దృష్టి సారించాలని సూచించారు. భారత ప్రభుత్వ ఎన్‌ఏఎల్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ఎ.ఉదయకుమార్ ప్రసంగిస్తూ తయారీ రంగంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. దక్షిణ కొరియాలో 200 మందితో నడపాల్సిన ఫ్యాక్టరీని 8 మందితో కృత్రిమ మేధస్సు ద్వారా నడుపుతున్నారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పి.సిద్దయ్య, ఇ.శ్రీనివాసరెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ తిరుమల రావు, కో–కన్వీనర్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, ఎండీ తౌసీఫ్ అహ్మద్, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగస్థల పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై హైదరాబాద్ కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డి. తిరుమలేశ్వరరావు సంయుక్త నిర్వహణలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా సోమవారం రంగస్థల పురస్కారాల ప్రదాన సభ నిర్వహించారు. ఆలయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ సభాధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, అతిథులుగా ప్రగతి కళామండలి అధ్యక్షుడు నూతలపాటి సాంబయ్య, ప్రముఖ సినీ నటులు నాయుడుగోపి, రాఘవరెడ్డి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాట్లాడుతూ సామాజికంగా అనేక రకాల సందేశాలను ప్రజలకు అందిస్తున్న రంగస్థల కళాకారులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్న కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ వారు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా ఉగాది పురస్కార గ్రహీతలైన వరికూటి శివప్రసాద్‌కు గురజాడ పురస్కారం, యు.సుబ్బరాయశర్మకు బళ్లారి రాఘవ పురస్కారం, ఎంవీఎల్ నరసింహారావుకు సీఎస్ఆర్ పురస్కారం, కృష్ణేశ్వరరావుకు గరికపాటి రాజారావు పురస్కారం, ఎస్.ఆంజనేయులు నాయుడుకు పనారస గోవిందరావు పురస్కారం, కె.వెంకటకృష్ణకు రఘురామయ్య పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. సభానంతరం చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించి ప్రదర్శించన ప్రక్షాళన సందేశాత్మక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను జి. మల్లికార్జునరావు, జీవీజీ శంకర్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: మానస సరోవరం 33/11 కేవీ కెపాసిటీ పెంచుతున్న కారణంగా ఈనెల 28న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివెలుగు రోడ్డు, జియావుద్దీన్ నగర్, గాంధీ నగర్, రాహూల్‌గాంధీ నగర్, షాప్ ఎంప్లాయీస్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, రజకుల కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మజ్జిగ పంపిణీ



గుంటూరు మెడికల్: జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు సోమవారం గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 1500 మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సహాయంతో మజ్జిగ పంపిణీ చేశామని, దాతలకు ట్రస్టు నిర్వాహకులు పఠాన్ అల్లా భక్షు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం.. కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు కృష్ణ బాబు కాలనీకి చెందిన ఎ.భాగ్యలక్ష్మి ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆర్ఎంపీ డాక్టర్ మోహన్‌రెడ్డి వద్ద తన భర్తకు పక్షవాతం చికిత్స చేయిస్తుంది. ఈక్రమంలో అక్కడ ప్రసన్న కుమారి అనే మహిళ పరిచయమైంది. తాను ప్రభుత్వ ఉద్యోగిగా పరిచయం చేసుకుంది. భాగ్యలక్ష్మి కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పింది. అందుకు మోహన్‌రెడ్డి వత్తాసు పలికారు. ఇరువురు గుంటూరు వచ్చి భాగ్యలక్ష్మి వద్ద రెండు దఫాలుగా రూ. 3లక్షలు తీసుకున్నారు. అనంతరం భాగ్యలక్ష్మి కుమారుడు మృతిచెందాడు. భాగ్యలక్ష్మి తన డబ్బులు ఇవ్వాలని కోరినా వారు ఇవ్వలేదు. మోసపోయినట్లు నిర్ధారించుకుని బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండా వెంకటప్పయ్యకాలనీకి చెందిన శివనాగేశ్వరరావు ఈనెల 24వ తేదీ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని అతని భార్య కంభంపాటి దుర్గా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భాషకు లిఖిత రూపమే లేఖనం



వర్క్‌షాప్ ప్రగతి పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య శ్రీదేవి, ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి, నిర్మల కుమారి, సురేష్‌కుమార్

- చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: మాట్లాడే భాషకు లిఖిత రూపమే లేఖనమని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీదేవి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం 'లేఖన నైపుణ్యాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి ప్రారంభించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీదేవి మాట్లాడుతూ భావ వ్యక్తీకరణకు భాష ముఖ్యమని, లేఖనం ద్వారానే ఎంతో ప్రాచీనమైన సాహిత్యాన్ని ఇప్పటికీ చదువగలుగుతున్నామని వివరించారు. లేఖన నైపుణ్యాలు ఉన్న వాళ్లు సామాజిక మాధ్యమాల ద్వారా మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించుకుంటున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాల విస్తృతి పెరుగుతున్న తరుణంలో లేఖనం ప్రాధాన్యతను సంతరించుకున్న నేపథ్యంలో విద్యార్థినులు వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ డి.మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. నిర్మలాకుమారి, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.సురేష్‌కుమార్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ధాత్రి కుమారి, డాక్టర్ దివిజాదేవి, డాక్టర్ విజయలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వానపాముల ఎరువు తయారీపై శిక్షణ



శిక్షణ తరగతిలో కేవీకే శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: విలువ ఆధారిత వానపాముల ఎరువు తయారీ ద్వారా రైతులు ఆరోగ్యకరమైన పంటలను పండించటంతోపాటు.. ఆదాయ మార్గాలు పొందవచ్చని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.వెంకటనాయుడు తెలిపారు. సోమవారం నగర శివారులోని లాంఫాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు కేవీకే, నారమ్ హైదరబాద్‌కు చెందిన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వానపాములతో ఎరువు తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంపోస్టు, వానపాముల ఎరువుతో దీర్ఘకాలికంగా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. నారమ్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ మాట్లాడుతూ కేవీకే ద్వారా ఎస్సీ రైతుల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ నిధులతో శిక్షణ తరగతులు నిర్వహిచటం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రెనింగ్ కో–ఆర్డినేటర్, కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కేవీ సుబ్రమణ్యం, అగ్రానమీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి, డాక్టర్ ఎస్.మధువాణి, డాక్టర్ ఎం.రత్నం, షేక్ అలీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిపాడు చర్చి వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు



చర్చి వద్ద పోలీస్ పికెటింగ్

పెదకాకాని: మండలంలోని గడ్డిపాడు చర్చి వద్ద పోలీసు పికెట్ కొనసాగుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డిపాడులో ఆదివారం ఓ వ్యక్తి మరణించాడు. అంత్యక్రియలు జరగకుండానే ఆ ప్రాంతంలో ఉన్న పరిశుద్ధ పౌలు లూథరన్ దేవాలయం(చర్చి)లో పాస్టర్ పులిదిండి రాజు రోజూ మాదిరిగానే ప్రార్థనలు నిర్వహించాడు. చర్చి కమిటీలో సభ్యుడైన కొచ్చర్ల శోభన్‌బాబు పాస్టర్‌కు ఫోన్ చేసి చనిపోయిన వ్యక్తి మృతదేహం పక్కన ఉన్నపుడు ప్రార్థనలు ఎందుకు చేశావంటూ అసభ్యంగా మాట్లాడాడు. దీంతో పాస్టర్ రాజు పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు నెలల క్రితం చర్చికి సంబంధించిన కమిటీని ఎంపిక చేసుకునే విషయంలో వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదం తిరిగి పునరావృతమై చర్చి పాస్టర్, ఇరువురు కమిటీ పెద్దలు, వారికి వ్యతిరేకంగా మరొక ముగ్గురు కమిటీ పెద్దలు వివాదానికి దిగడంతో ముందస్తు చర్యల్లో బాగంగా కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. ఇరు వర్గాలకు చెందిన 55 మందిపై కేసు నమోదు చేశామన్నారు. ఎటువంటి వివాదాలు, గొడవలు జరగకుండా పోలీసు పికెట్ కొనసాగుతుంది.

గడువులోగా సమస్యలు పరిష్కారమవ్వాలి

- అధికారులకు కార్పొరేషన్ అదనపు కమిషనర్ పెద్ది రోజా సూచన
- స్పందనలో 50 అర్జీలు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూనగర్: ప్రజా సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని అదనపు కమిషనర్ పెద్ది రోజా స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కమిషనర్ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. నోడల్ అధికారులు సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై పర్యవేక్షణ చేయాలని, ప్రతి సోమవారం నోడల్ అధికారులతో సచివాలయ పనితీరుపై సమీక్ష చేయాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 50 ఫిర్యాదులు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 18, ప్రజారోగ్య విభాగానికి 10, రెవెన్యూ విభాగానికి 4, ఉపాసెల్ విభాగానికి 3 చొప్పున ఫిర్యాదులు వచ్చాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఆర్ఓలు, ఈఈలు, ఎస్ఎస్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

31లోపు వడ్డీ రాయితీతో పన్నులు చెల్లించొచ్చు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఏకమొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటిపై ఉన్న వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, మరో 4 రోజుల్లో ఆ గడువు ముగుస్తుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చి 31లోపు పన్ను చెల్లించకుంటే వడ్డీ రాయితీ వర్తించదని, ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీని పొందాలన్నారు. నగరంలో నిర్మాణంలో భవన యజమానులకు ఖాళీ స్థల పన్ను పై వడ్డీ రాయితీ ప్రకటించడం సదవకాశమని, అటువంటి వారు వెంటనే పన్ను చెల్లించాలన్నారు. లేకుంటే మార్చి తర్వాత వడ్డీ కలిసి చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు. కావున నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆధునిక విద్యాబోధనతో విద్యార్థుల మేధస్సుకు పదును

- పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు



విద్యార్థులతో ఆర్జేడీ సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక విద్యాబోధనతో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టవచ్చని పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం అరండల్‌పేటలో కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, నెక్స్ట్‌జెన్ కిడ్స్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికగా సన్నద్ధమవ్వాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈసందర్భంగా గతేడాది టెన్త్ పరీక్షల్లో 540కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలను బహూకరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీవిద్య, కేబీ సావిత్రి, నారాయణ రావు, వైద్యులు తారక్‌నాథ్, ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఎస్.ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి స్త్రీ నిధి రుణాలు



ప్రత్తిపాడు వైకేపీ కార్యాలయంలో సమీక్షిస్తున్న స్త్రీనిధి ఏజీఎం చెన్నకేశవులు

ప్రత్తిపాడు: డ్వాక్రా మహిళలకు లక్ష్యానికి మించి విరివిగా స్త్రీనిధి రుణాలు మంజూరు చేసినట్లు స్త్రీనిధి ఏజీఎం చెన్నకేశవులు తెలిపారు. ప్రత్తిపాడులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలకు స్త్రీనిధి రుణాల విషయంలో చాలా వ్యత్యాసం ఉందన్నారు. ప్రస్తుతం గ్రూపులో పది మంది ఉంటే ఏడుగురికి, అంత కన్నా ఎక్కువ ఉంటే తొమ్మిది మందికి రుణాలు ఇస్తున్నామన్నారు. గతంలో గ్రూపునకు రూ.2.5 లక్షల వరకే రుణం ఇచ్చేవాళ్లమని, ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ.4.5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ప్రత్తిపాడు మండలంలో లక్ష్యానికి అనుగుణంగా రూ.4 కోట్లు స్త్రీనిధి నుంచి రుణాలిచ్చామన్నారు. ఇంకా అర్హత ఉన్న వారికి ఈ నెలాఖరు వరకు రుణాలివ్వడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా గతేడాది స్త్రీ నిధి రుణాల రికవరీ 99.9 శాతం ఉందని, ఈ ఏడాది నూరు శాతం రికవరీ చేయనున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. సమావేశంలో స్త్రీనిధి గుంటూరు క్లస్టర్ మేనేజర్ అమరావతి, ఏపీఎం జి.సురేష్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్డురాయి ప్రతిష్ట



పెదకాకానిలో ప్రతిష్టించిన బొడ్డురాయి

పెదకాకాని: భక్తిశ్రద్ధలతో బొడ్డురాయి ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి ఎంపీ నిధులతో పెదకాకాని ప్రధాన సెంటర్ నుంచి శివాలయం వరకూ రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి పనుల్లో బాగంగా తొలగించిన పెదకాకాని పాతూరు రోడ్డుపై బొడ్డురాయిని డివైడర్ వద్ద మంగళవారం ప్రతిష్ఠించారు. మూడు రోజుల ఉత్సవాలను మొదటి రోజు విఘ్నేశ్వరపూజతో ప్రారంభించారు. నాదెండ్ల రామేశ్వర్ గురుకుల్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది.

క్యూలైన్‌కు..రూ.లక్ష విరాళం

పెదకాకాని: పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ కోసం ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుకు గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన గూడూరు రామకృష్ణ, రమాదేవి దంపతులు రూ.లక్ష విరాళం సోమవారం అందజేశారు. నగదును ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా వర్కర్లకు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేటకు చెందిన దుద్దాడి సాగర్ (25) అరుంధతీనగర్‌లోని ఓ రూములో నివాసం ఉంటూ నగరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 26వ తేదీ రాత్రి తన రూములో ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట

పెదనందిపాడు: కొప్పర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయాలంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. సర్పంచ్ సాతులూరి సురేష్, ఉప సర్పంచ్ ఏలూరి శ్రీకాంత్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు.